# చరిత్రకెక్కిన చరితార్థులు

# భారతరత్న శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణన్

- వాసంతి మాఘుపు.

శ్రోతలను తన హావభావాలతో, హాస్యోక్తులతో, చక్కని ఉదాహరణలతో మంత్రముగ్ధులను చేసేవారు. కాగితము మీద రాసుకుని వచ్చి చదవడం ఆయనకు అలవాటు లేదు. 1928వ సంవత్సరములో ఆంధ్ర విశ్వవిద్యాలయము మొట్టమొదటి గౌరవ డాక్టరేటును రాధాకృష్ణన్‌కు ఇచ్చి సత్కరించింది. 1931వ సంవత్సరములో ఆంధ్ర విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ పదవికై జరిగిన ఎన్నికలో వెంకటరత్నంనాయుడు (ఆంధ్రదేశంలో బ్రహ్మ సమాజ ప్రచారకుడు) గారితో పోటీచేసి గెలుపొందారు. తదనంతరము విజయవాడ నుండి విశాఖపట్నం మార్చబడిన ఆంధ్ర విశ్వవిద్యాలయానికి కావలసిన సదుపాయములను, బోధనా సిబ్బందిని, వసతి గృహములను ఏర్పరచుటలో ఆయన కార్యదీక్ష ఎంతో ప్రశంసనీయము. తన వృత్తి బాధ్యతలను నిర్వహిస్తూనే, అనేక దేశాలలో వారి ఆహ్వానం మేరకు వివిధ అంశాలపై ప్రసంగిస్తూ, అనేక తత్త్వశాస్త్రమునకు సంబంధించిన గ్రంథాలకు సంపాదకత్వ బాధ్యతలు స్వీకరించారు.

1936వ సంవత్సములో ఆయన అరుదైన స్పాల్డింగ్ పీఠానికి ఆహ్వానింపబడి, సంవత్సములో ఆరు నెలల కాలము లండన్‌లోను, మిగిలిన ఆరు నెలలో కలకత్తా విశ్వవిద్యాలయములోను ఆచార్యునిగా కొనసాగడానికి అంగీకరించారు. తరువాత కొంత కాలానికి వార్ధా వెళ్ళి మహాత్మాగాంధీ గారిని కలుసుకున్నారు. గాంధీ గారి 70వ జన్మదిన సందర్భముగా వెలువరించిన అభినందన సంచికకు సంపాదకునిగా రాధాకృష్ణన్ వ్యవహరించాడు. తరువాత కొన్ని కారణములవలన లండన్‌లోని ఆచార్యపదవిని వదిలిపెట్టవలసి రావడంతో, మదన్‌మోహన్ మాలవీయ విశ్వవిద్యాలయానికి వారాంతములో సేవలు అందించడానికి సిద్ధమయ్యారు. ఆ తరువాత 1941వ సంవత్సరములో కలకత్తా విశ్వవిద్యాలయానికి రాజీనామాను సమర్పించి, కాశీ (మదన్‌మోహన్ మాలవీయ) విశ్వవిద్యాలయానికి ఉపాధ్యక్ష పదవిని అలంకరించాడు.

లాలాలజపతిరాయ్, గోపాలకృష్ణ గోఖలే, అనీబిసెంట్, మదన మోహనమాలవీయ, సురేంద్రనాథ్ బెనర్జీ, మహాత్మాగాంధీ, బాలగంగాధర తిలక్, రాజగోపాలాచారి, జయప్రకాశ్ నారాయణ్, రాజేంద్రప్రసాద్, జవహర్‌లాల్ నెహ్రూ మొదలైన ఎందరో స్వాతంత్య్ర సమరయోధులతో సన్నిహితంగా మెలుగుతూ, వారి చర్యలను కొనియాడుతూ ఎన్నో వ్యాసములను వ్రాసేవారు. కుటుంబ పరిస్థితుల కారణంగా చాలా కాలము స్వాతంత్య్ర సమరములో ప్రత్యక్షముగా పాల్గొనలేకపోయినా, జరుగుతున్న

సంఘటనలను తెలుసుకుంటూ, ఎన్నో పత్రికలకు వ్యాసాలను వ్రాస్తూ తన వంతు కృషిని చేసారు.

ఆయన నానాజాతిసమితిలో సభ్యుడిగాను, 1946 నుండి 1954 వరకు ఐక్యరాజ్యసమితి విద్యావైజ్ఞానిక సాంస్కృతిక వ్యవహారాల నిర్వాహణ కమిటీ (యునెస్కో) లో భారత ప్రతినిధి వర్గానికి నాయకుడిగాను, ఐక్యరాజ్యసమితి కార్య నిర్వాహక వర్గానికి చైర్మన్‌గాను, ఐక్యరాజ్యసమితి జనరల్ కాన్ఫరెన్సుకు అధ్యక్షునిగాను వివిధ పదవులలో తన సేవలను అందించాడు.1946లో భారత రాజ్యాంగ నిర్ణయ సమితిలో సభ్యుడుగా ఎన్నుకోబడి 1949 వరకు కొనసాగాడు. 1946 డిశంబరు 11వ తేదీన మరియు 1947 జనవరి 20వ తేదీన సమావేశాలలో ప్రసంగించి, జాతికి మంచి సందేశాన్ని అందించారు. 1947 ఆగస్టు 14 వతేదీన అర్థరాత్రి స్వతంత్ర్యము సిద్ధించిన అనంతరము, నెహ్రూ తరువాత రాధాకృష్ణన్ ప్రసంగించారు. 1949లో రష్యాకు భారతదేశ రాయబారిగా వెళ్ళి, స్టాలిన్‌తో చర్చలు జరిపి, ఆయన ప్రశంసలు అందుకున్నారు.

1950 జనవరి 26 నుండి క్రొత్త రాజ్యాంగం అమలు చేసిన సందర్భములో ఉపరాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. 1954లో ప్రారంభించిన కేంద్ర సాహిత్య అకాడమికి ఉపాధ్యక్షునిగా వ్యవహరించారు. ఉపరాష్ట్రపతి పదవీ కాలంలో భారత విదేశాంగ విధానాన్ని ప్రపంచానికి తెలియజెప్పటానికి యూరప్, ఆఫ్రికా, రష్యా, జపాన్, చైనా, నేపాల్, అమెరికా సంయుక్త రాష్ట్రములు మొదలైన చోట్లను సందర్శించారు. 1954లో భారతరత్న పురస్కారము పొందారు. 1962లో (డాక్టర్. రాజేంద్రప్రసాద్ తరువాత) రెండవ రాష్ట్రపతిగా ఎన్నుకోబడ్డారు. ఆయన రాష్ట్రపతిగా ఉన్న సమయంలోనే అప్పటి ప్రధాని నెహ్రూ మరణించారు. వెంటనే లాల్‌బహదూర్‌శాస్త్రిని ప్రధానమంత్రిగా నియమించారు. లాల్‌బహదూర్‌శాస్త్రిగారు పదవిలో ఉండగానే, 1966 జనవరి 11న తాష్కెంట్‌లో మరణించడం తటస్తించింది. అనంతరం ఇందిరా ప్రియదర్శినిని ప్రధానమంత్రిని చేసారు. 1967లో రాష్ట్రపతి పదవీకాలం ముగిసిన తరువాత తిరిగి మద్రాస్ చేరుకుని, 1975 ఏప్రియల్ 17వ తేదీన తుది శ్వాస విడిచారు.

రాధాకృష్ణన్ భగవద్గీత శ్లోకములకు ఆంగ్లములో వివరణ వ్రాసారు. ఉపనిషత్తులను ఆంగ్లంలోకి అనువదించారు. బౌద్ధ ధర్మ గ్రంథమైన "ధమ్మపథ" కు ఆంగ్లానువాదం వ్రాసారు. ఈయన విద్యార్థిగా, ఉపాధ్యాయుడిగా, ఆచార్యుడిగా, ఉపాధ్యక్షునిగా, స్వాతంత్ర్య సమరయోధునిగా, ఉపరాష్ట్రపతిగా, రాష్ట్రపతిగా అన్ని దశలలోనూ తన కర్తవ్యాన్ని చక్కగా నిర్వర్తించారు.

**క్లుప్తంగా ...**

**పుట్టిన తేదీ : సెప్టెంబరు 5, 1888.**

**భారతరత్న పురస్కారము పొందినది : 1954.**

**రాష్ట్రపతిగా పదవీ స్వీకారం : మే 13, 1962.**

**మరణించినరోజు : ఏప్రియల్ 17, 1975.**